


# విజేత

శ్రీపతి లలిత

ఏదో తెలీని నంబర్ నుంచి మళ్లీ, మళ్లీ ఫోన్ వస్తుంటే, ఎత్తి, విసుగ్గా, “హలో!” అంది అనఘ.

“అనఘా! నేనమ్మా! త్రిపురని, ఇది నా కొత్త నంబర్!”

“అరే! త్రిపుర అత్తయ్యగారు! అత్తయ్యా! ఎక్కడినుంచి ఫోన్? ఇండియా వచ్చారా? మామయ్యగారు ఎలా ఉన్నారు? వదినా వాళ్లంతా బావున్నారా?” అనఘ ప్రశ్నల మీద ప్రశ్నలు గుప్పిస్తుంటే, నవ్వేసింది త్రిపుర.

“అందరూ బావున్నారు! నీ సంగతి చెప్పు నువ్వెలా ఉన్నావు?” అత్తగారి ప్రశ్నకి వెంటనే సమాధానం చెప్పలేదు. నెమ్మదిగా “నాకేం! నేను బానే ఉన్నాను!” అంది అనఘ.

“గుడ్! అదే కావాలి, ఉంటానమ్మా! మేము అమెరికా నుంచి వచ్చేసామని చెప్పడానికి ఫోన్ చేసాను!” అనఘ ఏదో అనేలోగా ఫోన్ పెట్టేసింది త్రిపుర.

‘ఇదేమిటీ! ఈవిడ ఏదో క్లాస్ పీకుతుంది, ఇప్పట్లో వదలదు అనుకుంటే, ఇలా పెట్టేసింది’ అనుకుంటూ బయటికి వచ్చేసరికి, అనఘ తల్లి కాత్యాయని, “ఎవరే ఆ ఫోను?” అనుమానంగా అడిగింది.

“మా అత్తగారు!” అబద్ధం చెప్పలేక, నిజం చెప్పింది.

“ఎందుకటా! నిన్ను తిట్టిందా? ఎంతైనా కొడుకు పక్షమే కదా! అసలు ఈవిడ పెంపకం కాదూ, అతను అలా తయారు అవ్వడానికి… “ మొదటిసారి తల్లి మాటలు విసుగొచ్చాయి అనఘకి. “అమ్మా! నువ్వు ఆపుతావా? ఆవిడ అసలు ఏమీ మాట్లాడలేదు, మేము అమెరికా నుంచి వచ్చాము, అని చెప్పి పెట్టేసారు!”

” అంతేలే! అంతకంటే మాట్లాడడానికి ముఖం చెల్లద్దూ!” తల్లి మాటలకు కోపం వచ్చింది “ఛీ!ఛీ! ఇంట్లో మనశ్శాంతి లేకుండా చేస్తావు!” విసురుగా రూమ్‌లోకి వచ్చి తలుపు గట్టిగా వేసింది.

"నేనేమన్నాను! అంత కోపం , ముందొచ్చిన చెవుల కంటే అన్నట్టు, చిన్నప్పటినుంచి పెంచిన తల్లి కంటే అత్తగారు ఎక్కువయ్యారు ఈవిడకి..." తల్లి విసుర్లు వినిపిస్తూనే ఉన్నాయి. చెవుల్లో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని పాటలు పెట్టుకుంది కానీ, మనసు మాత్రం ఎక్కడికో పరిగెత్తుతోంది.

★★★

అనఘ... కాత్యాయని,శివరావుల కూతురు, సాఫ్ట్వేర్ ఇంజనీరుగా పని చేస్తోంది.

ఆరునెలల క్రితం, సిద్ధార్థతో పెళ్లి అయింది.

అది పెద్దలు కుదిర్చిన పెళ్లి. అతని తల్లి త్రిపుర, ఒక బ్యాంకులో మేనేజర్గా చేసి ఈ మధ్యే రిటైర్ అయ్యింది, తండ్రి సోమేష్ యూనివర్సిటీ ప్రొఫెసర్గా చేసి రిటైర్ అయ్యారు.

అక్క , భర్తతో అమెరికాలో ఉంటుంది.

పెళ్ళయ్యి అత్తగారింటికి వెళ్లిన అనఘకి, ఇంట్లో పనిమనిషి, వంటమనిషి, ఉండడంతో ఇంటి పని చేసే అవసరం ఉండేది కాదు. త్రిపుర కూడా ఉద్యోగం చేసిన ఆమే కనక, కోడలిని ఏ విషయంలోనూ ఇబ్బంది పెట్టేది కాదు. ఏ బాదరబంది లేకుండా ఉద్యోగం చెయ్యడం, సెలవు రోజుల్లో భర్తతో, అత్తామామలతో గడపడం, రెండు నెలలు ఎంతో ఆనందంగా జరిగిపోయింది సంసారం.

అప్పుడే, సిద్ధార్థ అక్క, తల్లితండ్రుల్ని, మూడు నెలలు తమతో గడపడానికి, అమెరికా రమ్మని ఆహ్వానించింది. కూతురి దగ్గరికి వెళ్లేముందు వంద జాగ్రత్తలు చెప్పింది త్రిపుర.

"ఒక విధంగా సిద్ధుకి పని అలవాటు కాకపోవడం నాదే తప్పు అనఘా! నా ఉద్యోగం హడావిడికి, మొదటినుంచి ఇంట్లో పనివాళ్ళ సాయం ఎక్కువ ఉండేది. దానితో పిల్లలకి, ఆయనకి, ఏ పనీ అలవాటు అవలేదు. మా అమ్మాయి అమెరికా వెళ్లి నేర్చుకుంది. సిద్ధుకి ఏదైనా చెప్తే, అవసరమున్నప్పుడు చేస్తా అంటాడు. నెమ్మదిగా తనకి చిన్న పనులు నేర్పించు, కూరలు, సరుకులు ఇద్దరూ కలిసి తెస్తే కొంత తెలుస్తాయి. కొంతకాలం మేము కూడా లేకపోతే, మీ ఇద్దరికీ ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి, పూర్తిగా సమయము దొరుకుతుందని నా నమ్మకం".

రెండు నెలల తర్వాత, ఒక రోజు అనఘ, అత్తగారికి ఫోన్ చేసింది, "అత్తయ్యా! మా నాన్న ఆఫీస్ పని మీద వెళ్లారు, రావడానికి ఇంకా ఒక నెల పట్టచ్చు. మొన్న అమ్మకి టైఫాయిడ్ జ్వరం వచ్చింది. నేను వెళ్లి వారం ఉండి వచ్చాను. మీకు తెలుసు కదా సిద్ధు సంగతి. "ఇంట్లో ఎవరూ లేకపోతే ఇబ్బంది అవుతుంది, అమ్మని మన ఇంటికే తెచ్చెయ్యి అన్నారు. మీకు చెప్దామని..."

"అనఘా! నువ్వు కూడా ఆ ఇంటి యజమానురాలివే! నాకు ఎంత స్వతంత్రం ఉందో, నీకూ అంతే.

మీ అమ్మగారిని మన ఇంటికి తీసుకుని రావడానికి, నీకు, నా పర్మిషన్ అక్కర్లేదమ్మా! అమ్మని జాగ్రత్తగా చూసుకోండి!" త్రిపుర చెప్పినదానికి పొంగిపోయింది ఆమె.

"థాంక్యూ! అత్తయ్యా! నేను మీ కోడలిగా వచ్చినందుకు ఎంత సంతోషంగా ఉందో మాటల్లో చెప్పలేను..."అనఘ అంటే, " పోనీ పాటల్లో చెప్పు!" నవ్వేస్తూ అంది త్రిపుర.

ఆనందంతో వెలిగిపోతున్న కూతురు మొహం చూసి, "మీ అత్తమ్మ పర్మిషన్ ఇచ్చిందా నన్ను మీ ఇంటికి తీసుకెళ్లడానికి!" తల్లి మాటల్లోని శ్లేష పట్టించుకోలేదు ఆమె.

గబగబా తల్లి బట్టలు, మిగిలినవి సర్ది ఇంటికి తీసుకెళ్లింది.

వెళ్ళేసరికి సిద్ధు గెస్ట్ రూమ్‌లో అన్నీ సర్దిపెట్టాడు. "రండి అత్తయ్యా!" ఆప్యాయంగా పలకరించాడు.

అనఘ తల్లిని లోపలికి తీసుకెళ్లి అక్కడ కూర్చోబెట్టింది. ఈ లోగా ఇంట్లో పనిచేసే లక్ష్మి, వంట చేసే మణి,ఇద్దరూ వచ్చి "బావున్నారా అమ్మా!" అంటూ పలకరించారు ఇద్దరూ.

"అమ్మా! నీకు ఏం కావాలన్నా వీళ్ళిద్దరూ చూసుకుంటారు" అంది అనఘ.

"అయితే వియ్యపురాలు లేని లోటు తీరుస్తారన్నమాట!" కాత్యాయని  నవ్వుతూ అన్నా,ఏదో వెక్కిరించినట్టు అనిపించింది వాళ్ళిద్దరికీ.

★★★

మర్నాటి నుంచి అసలు నాటకం మొదలైంది. వాళ్ళ ప్రతీ పనికీ వంక పెట్టి, భూతద్దంలో అనఘకి చూపించడం మొదలుపెట్టింది కాత్యాయని.

"అమ్మో! మీ అత్తగారు పనివాళ్ళని ఇంటివాళ్లలాగా, ఇంటివాళ్ళని పనివాళ్ళలాగా చూస్తుంది. వీళ్లు ఇల్లంతా దోచుకు తింటున్నారు. వాళ్ళకి కాఫీలు, టిఫిన్లు, జీతాల డబ్బుతో ఇంకో ఇల్లు కొనచ్చు" లాంటి మాటలు విని, లక్ష్మి, మణి మొహాలు మాడిపోయాయి.

సిద్ధుకి ముందు నుంచి పెద్ద పనులు అలవాటు లేవు. అనఘ అతనికి కాఫీ అందించినా, ఏదైనా కనపడలేదంటే వెతికి ఇచ్చినా,

"ఏం పెంచింది మీ అత్తగారు! ఒక్క పని రాదు! అన్నిటికీ నిన్ను పిలుస్తాడు!" విసుక్కునేది.

ఒక నాలుగు  రోజుల తర్వాత, మణి  "అర్జెంటు పని ఉంది ఊరు వెళ్ళాలి"  అని వెళ్ళింది.

లక్ష్మి, "ఇంటి దగ్గర అత్తని  చూడాలి! ఒక్కటే పూట వచ్చి త్వరగా చేసుకుని వెళ్తాను!" అని చెప్పింది.

"మీ అత్తగారు, నేను ఇక్కడ ఉండడం ఇష్టం లేక, వీళ్ళ చేత నాటకాలాడిస్తోంది!"  అంది కాత్యాయని.

"ఏం మాట్లాడుతున్నావమ్మా! ఆవిడే నిన్ను తీసుకురమ్మన్నారు" అన్న అనఘతో, " ఆవిడ మంచిగా కనపడాలిగా!" అంది కాత్యాయని.

తల్లి విసుర్లు, సణుగులతో, అప్పటివరకు హాయిగా ఉన్న అనఘకి, ఇంట్లో ఉండాలంటే, భయంగా ఉంటోంది. సిద్ధు, "నేను వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తాను!" అని ఇంట్లో ఉండి అత్తగారిని చూసుకోవడానికి ప్రయత్నించాడు.

అనఘ ఇంట్లో లేనప్పుడు, చాలా ఓర్పుగానే ఉండేవాడు సిద్ధు. కాత్యాయని మాత్రం ప్రతీ విషయంలో, త్రిపురని విమర్శించడం, ఆవిడ పెంపకం తప్పు పట్టడం చేసేది.

"నేను అనఘ కోసం ఎన్ని త్యాగాలు చేసానో!" అంటూ కథలు కథలుగా చెప్పడం, "కాల్‌లో ఉన్నాను, డిస్టర్బ్ చేయద్దు!" సిద్ధు చెప్పి తలుపు వేసుకుంటే, ఏదో వంకన తలుపు కొట్టడం, పెద్దగా టీవీ పెట్టడం చేసేది.

సిద్ధు విసుక్కుంటే, ఇంటికి రాగానే, అనఘకి చాడీలు చెప్పడం, కళ్ళనీళ్ళు పెట్టుకుని ఏడ్చేయడం చేసేది.

కన్నతల్లి అలా తన బాధలు చెప్తుంటే, ఊరుకోలేక, అందర్నీ విసుక్కోవడం మొదలుపెట్టింది అనఘ.

ఒక రోజు, సిద్ధు మీద తల్లి చాడీలు విన్న కోపంలో, "నీకు ఏమాత్రం బాధ్యత తెలీదు. మరీ ఏమీ తెలీకుండా పెంచారు మీ అమ్మ!" అంటూ తిట్టేసింది. అనవసరంగా నోరు జారాను అనుకునేలోగానే,

"మా అమ్మని అంటే ఊర్కోను! అంత బాగా పెంచారుగా మీ అమ్మ! మీ ఇంటికి తీసుకు వెళ్లి చూసుకో. ఆవిడ వచ్చాక, నాకు చాలా డిస్టర్బన్స్ గా ఉంది, మన ఇద్దరికీ గొడవలు కూడా ఎక్కువయ్యాయి" కోపంగా అరిచాడు సిద్ధు.

అప్పటివరకు అక్కడే తచ్చట్లాడుతున్న కాత్యాయని,"చూసావా ఎలా మాట్లాడుతున్నాడో! అంతా మీ అత్తగారి ట్రైనింగ్!" అంది.

"మీరు మా అమ్మని ఏమీ అనకండి. ఆవిడ పేరు తలుచుకోవడానికి కూడా మీరు సరిపోరు." సిద్ధు అన్నదానికి, అనఘ రెచ్చిపోయింది, తల్లిని తీసుకుని ఇంటికి వచ్చేసింది. ఇవన్నీ తండ్రికి చెప్పలేదు, అత్తగారికీ చెప్పలేదు.

★★★

ఇంటికి వచ్చిన నుంచీ, కాత్యాయని అల్లుడితో పాటు, త్రిపురని కూడా తిట్టిపోస్తూనే ఉంది. అనఘ ఏదైనా అనబోతే ఇంకా రెచ్చిపోతోంది. "ఎట్టి పరిస్థితుల్లోనూ, సిద్ధు వచ్చి నా కాళ్ళు పట్టుకుని క్షమాపణ చెప్తేనే, నువ్వు అత్తింటికి వెళ్ళాలి. లేదంటే వాడికి విడాకులు ఇచ్చేయి! నన్ను అంత మాటంటాడా!" అంటూ గట్టిగా అరుపులతో బీపీ పెంచుకుంది.

డాక్టర్, "ఆమెని జాగ్రత్తగా చూసుకోవాలి!" అనేసరికి, నోరెత్తకుండా ఉంటోంది అనఘ.

శివరాం వచ్చాక, అనఘ చెప్పకుండానే, జరిగింది గ్రహించాడు.

"ఇది నీ జీవితం. నిర్ణయం తీసుకోవడంలో ఎవరి ప్రమేయం ఉండకూడదు!" అన్నాడాయన.

★★★

మరో నాలుగు రోజుల తర్వాత, త్రిపుర, అనఘకి మెసేజ్ పెట్టింది.

"నేను మీ ఆఫీస్ దగ్గర్లో ఉన్నాను. నీకు కుదిరితే లంచ్ కలిసి చేద్దామా?".

అనఘకి కూడా, అత్తగారిని కలవడానికి వెళ్ళనందుకు చాలా గిల్టీ గా ఉంది. అందుకే వెంటనే, “ఓకే!” అని దగ్గర్లో హోటల్ లొకేషన్ పంపింది.

అనఘని చూడగానే ఆవిడ, “ఇదేంటమ్మా ఇలా అయిపోయావు. కళ్ళ కింద నల్లగా అయిపోయింది, చిక్కిపోయావు!” అంటుంటే, వస్తున్న కన్నీరు కంట్రోల్ చేసుకుంది.

“మీరు, మామయ్యగారు ఎలా ఉన్నారు అత్తయ్యా?” భోజనం ఆర్డర్ ఇచ్చి అడిగింది. త్రిపుర, సమాధానంగా బావున్నామన్నట్టు తల ఊపి,

“మీ ఇద్దరి మధ్యా ఏమయిందని కానీ, ఏం చేస్తావు అని కానీ అడగను అనఘా! పెళ్లి అనేది, మీ సాఫ్ట్వేర్‌వారి భాషలో ఒక ప్రాజెక్ట్. నువ్వు, సిద్ధు దాని లీడర్లు, ఆ ప్రాజెక్టుని విజయవంతం చెయ్యడానికి ఏం చేస్తారు అనేది, మీ బాధ్యత. విజయం అంటే ఏమిటో కూడా మీరే ఆలోచించండి. ‘మీ టీమ్‌లో ఎప్పుడూ నేనే రైట్, నేను చెప్పిందే చెయ్యాలి, అనుకుంటే పని సాగదు కదా! అలాగే వేరే ప్రాజెక్ట్ లీడర్‌ని మీ ప్రాజెక్ట్ హ్యాండిల్ చెయ్యనివ్వరు కదా!

కాపురంలో కూడా అంతే! ఇద్దరూ బాలన్స్ చెయ్యాలి. ఒకరు ఖర్చు పెట్టేవారుంటే, ఇంకోరు జాగ్రత్తగా ఉండాలి. ఒకరు కోపం తెచ్చుకుంటే, ఇంకోరు శాంతంగా ఉండాలి. అలా అని ఎప్పుడూ ఒకరే తగ్గి ఉండాలని నేను చెప్పడంలేదు.

ఇద్దరూ సమానమైనా, ఒకసారి ఒకరు తగ్గితే, ఇంకోసారి ఇంకోళ్ళు తగ్గాలి. ఎక్కడ, ఎప్పుడు, ఎంత తగ్గాలో తెలిసినవాళ్లే విజేతలు. నిన్ను, సిద్ధుని, ఒకరితో, ఒకరిని పోల్చను. మీరు వేర్వేరు వ్యక్తిత్వం ఉన్న వ్యక్తులు. భార్యాభర్తలు, రెండు పట్టాలలాగా సమాంతరంగానే ఉండాలి. అప్పుడే సంసారం అనే బండి, పట్టాల మీద సరిగ్గా నడుస్తుంది, లేదంటే ఆక్సిడెంట్ అవుతుంది.

మా జీవితం చాలా మటుకు అయిపోయింది. మీది ముందుంది. మా గురించి మీరు నిర్ణయాలు తీసుకోకండి. మీ గురించే ఆలోచించండి. నేను నీకు ఎలాంటి సలహా ఇవ్వను. ఎందుకంటే, ప్రతీ అత్తా ఒక అమ్మ అయినట్లే, ప్రతీ అమ్మలో ఒక అత్త ఉంటుంది. నువ్వు తెలివిగా ఆలోచిస్తావని, సరైన నిర్ణయం తీసుకుంటావని, నాకు నీ మీద నమ్మకం ఉంది. ఏదైనా నిర్ణయం తీసుకున్నాక, భవిష్యత్తులో ఏ రోజూ, ఇలా ఎందుకు చేసాను అనుకోకూడదు. ఇదొక్కటి మనసులో పెట్టుకో!“ అత్తగారి మాటలకి దేనికీ సమాధానం ఇవ్వలేదు అనఘ. నెమ్మదిగా విన్నది.

భోజనం అయ్యాక క్యాబ్ ఎక్కుతూ, “పెళ్లికి ముందు, నీ కళ్ళలో మెరుపు, బుగ్గల్లో ఎరుపు, చూసి నా కోడలు ఇలా ఉండాలి అనుకున్నాను. ఇప్పుడు కళ్ళ కింద నలుపు, బుగ్గలు లోతుకెళ్లి ఎవరు ఈ అమ్మాయి అనుకునేలాగా ఉన్నావు, మళ్లీ మా పాత అనఘని చూపించు” నవ్వుతూ అంది త్రిపుర.

★★★

ఇంటికి వెళ్ళాక “ఏం ఆలోచిస్తున్నావు? మీ అత్తగారు కూడా వచ్చిందిగా! ఒక డివోర్స్ నోటీస్ పంపు వాడికి” అంది కాత్యాయని. “వాడు అంటే?” సీరియస్‌గా అంది అనఘ. తడబడింది కాత్యాయని. “అదేలే సిద్ధార్థ...”

"మన ఇంట్లో పనివాళ్ళని కూడా వాడూ, అదీ అని అనం కదా! నీ కోపం ఎవరిమీదమ్మా? నా మీదా, సిద్ధు మీదా,లేక మా అత్తగారి మీదనా!" బాధగా అంది, తల్లితో.

"నాకెందుకు కోపం ఎవరిమీదా లేదు! ఏదో నువ్వు బాధ పడకూడదని" గొంతు తీవ్రంగా పెంచి అంది కాత్యాయని.

"నేను బాధ పడుతున్నానని నీకు చెప్పానా? అతను తిడుతున్నాడని, కొడుతున్నాడని అన్నానా? నీకు ఒంట్లో బాగాలేదంటే ఎంత శ్రద్ధ తీసుకున్నాడు తను. నువ్వు ... ప్రతీదానికీ వాళ్ళ అమ్మని తక్కువ చేసి మాట్లాడావు! అది తప్పు కాదా! ఒక్కసారి నిన్ను అన్నందుకే నాకు కోపం వచ్చింది, నువ్వు ఎన్నిసార్లు వాళ్ళ అమ్మని అన్నావు!"

ఏమాత్రం ఊహించని కూతురు మాటలకి, మరింత కోపం వచ్చింది కాత్యాయనికి.

"పోవే! పోయి అక్కడే పడుండు, అత్తగారికి సేవలు చేస్తూ! ఏదో ఒకరకంగా ఆ ఇంట్లోనుంచి బయటికి లాక్కొస్తే నువ్వు సుఖపడతావని నా ఆలోచన. అన్నిటికీ మా అమ్మ ఇలా, మా అమ్మ అలా అంటుంటే నిన్ను ఎవరూ పట్టించుకోరని.." ఆవేశంతో బరువుగా ఊపిరి తీస్తూ ఆగింది.

"నీ కూతురు నువ్వు చెప్పినట్లు వినాలి. మా ఆయన, వాళ్ల అమ్మ మాట వింటే, నేను విడాకులు ఇవ్వాలి! ఇదేం న్యాయం అమ్మా!" అన్న కూతుర్ని బిత్తరపోయి చూసింది.

"అంటే... ఇచ్చేయమని కాదు బెదిరిస్తే చచ్చినట్లు దారికి వస్తాడు."

"ఎవరి దారికి రావాలమ్మా? నీ దారికా! అలా వస్తే నువ్వు మా ఇంటికి వస్తావా? అక్కడే ఉండి సిద్ధుని, మా అత్తగారిని నీ దారిలో పెడుదువుగాని".

"ఏం మాట్లాడుతున్నావే" అరిచింది కాత్యాయని.

"నువ్వు మా అత్తగారింట్లో వేసిన వేషాలు అన్నీ నాకు తెలుసు. ఇంకా అక్కడే ఉంటే, జీవితంలో సిద్ధు మొహం చూడలేను, అందుకే వచ్చేశాను. నీకు, నీ అహం తప్ప వేరే ఏమీ అక్కర్లేదు. ముందు నుంచి, మా అత్తగారిని పొగిడితే తట్టుకోలేకపోయావు. ఆవిడ సంస్కారంలో వందో వంతు లేదు నీకు. అదేమాట సిద్ధు అంటే కోపం వచ్చింది.

అందర్నీ నీ దారికి తెచ్చుకుందామనే ఆత్రంలో, నువ్వు ఒంటరి అయిపోతున్నావు. వదినని నీ దారికి తెచ్చుకోవాలని, అన్నయ్యను దూరం చేసుకున్నావు. ఇప్పుడు నన్ను! చివరికి నీతో ఎవరూ ఉండరు. అప్పుడు నీ దారి ఎటు? ఒక్కసారి ఆలోచించుకో! నేను సిద్ధుకి ఫోన్ చేశాను. తను నా కోసం వస్తున్నాడు. నా భర్తకు, అత్తమామలకి గౌరవం ఇచ్చేటయితేనే మా ఇంటికి రా! " తీక్షణంగా చెప్పి బట్టలు సర్దుకుంటున్న కూతుర్ని విస్తుపోయి చూసింది కాత్యాయని.

"చూడండి అనఘ ఎలా అంటోందో, " భర్తతో అనబోతే, "ఎవరి జీవితం గురించి నిర్ణయం వారు తీసుకోవడమే మంచిది. గెలిచినా,ఓడినా, వారిదే బాధ్యత!" అన్నాడు శివరాం.

మాటల్లోనే సిద్ధార్థ వచ్చాడు. "సరైన నిర్ణయమే తీసుకున్నాను నాన్నా! నేను విజేతనే!" నవ్వేస్తూ తండ్రితో చెప్పి, కారు వేపు సాగిపోయింది అనఘ.

***

COMMENTS